క్లుప్తంగా

22న ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి కల్చరల్: యూత్ హాస్టల్లో ఈ నెల 22న ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఈతరం కవితా వేదిక కార్యదర్శి సింగార బాలమురళీకృష్ణ తెలిపారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పే కవి సమ్మేళనంలో కవులు, రచయితలు, సాహిత్యాభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దేవరకొండపై ప్రత్యేక పూజలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కొండపై చెక్కభజనలు, కోలాటాలు, పిల్లనగ్రోవుల సందడి కనిపించింది.

మైతాపు మల్లమ్మకు డాక్టరేట్



తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీయూ తెలుగు అధ్యయనశాఖలో జూపాక సుభద్ర రచనలు–పరిశీలన అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించిన మైతాపు మల్లమ్మకు వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆమె ప్రొఫెసర్ పేట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేశారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శనివారం తెలంగాణ మంత్రి సత్యవతి రాథోడ్, తెలంగాణ ఎమ్మెల్యేలు బేతి సుభాష్ రెడ్డి, గాంధీ దర్శించుకున్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇవ్వగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

నేడు ప్రమాణ స్వీకారం

తిరుపతి కల్చరల్: కొత్తవీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వాకవి క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయనుందని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు టి.రమేష్‌బాబు, ఎస్.శ్రీరాములు తెలిపారు. వారు శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు.

ఎన్నిక ఏదైనా విజయం వైఎస్సార్‌సీపీదే

భాకరాపేట: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నిక ఏదైనా విజయం వైఎస్సార్‌సీపీదేనని పీలేరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు, డీసీఎంఎస్ చైర్మన్ సామకోటి సహదేవరెడ్డి తెలిపారు. ఆయన శనివారం భాకరాపేటలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన 14 ఎమ్మెల్సీ స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 12 స్థానాలు కైవసం చేసుకుందన్నారు. రెండు స్థానాలు గెలిచిన టీడీపీ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు.

వృద్ధులకు రంగస్థలి చేయూత



వృద్ధాశ్రమానికి సరుకులు, పండ్లు వితరణ చేస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: భవానినగర్‌లోని విజసాయి దుర్గ సేవా ట్రస్ట్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శనివారం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో సీనియర్ కళాకారుడు కె.రఘురామ్ జ్ఞాపకార్థం బియ్యం, నిత్యావసర సరుకులు, పండ్లు వితరణ చేశారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు వసంతమ్మ, జయమ్మను ఘనంగా సత్కరించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, రంగస్థలి కార్యదర్శి కేఎస్.రాజా, టి.సుబ్రమణ్యం రెడ్డి, తిరుమలయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా రాయలచెరువు

రామచంద్రాపురం : మండలంలోని రాయలచెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు సెట్విన్ సీఈఓ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన శనివారం సీక్యాప్ బృందంతో కలిసి చెరువును పరిశీలించారు. సీఈఓ మాట్లాడుతూ యువత కోసం వాటర్ స్పోర్ట్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బోటు డ్రైవింగ్, గజ ఈత తదితరాల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందించనున్నట్లు చెప్పారు. ఇండియన్ కయాకింగ్ అండ్ క్యానోయింగ్ అసోసియేషన్ చైర్మన్ ప్రదీప్ నాయుడు, ప్రెసిడెంట్ బలరామనాయుడు పాల్గొన్నారు.

శ్రీనివాసుడి దర్శనం కోసం..



అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద దర్శన టోకెన్ల కోసం క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

తిరుమల శ్రీనివాసుడిని శనివారం దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో సర్వదర్శనం టోకెన్ల కోసం శనివారం అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి క్యూలైన్‌లో బారులు తీరారు. చంటి పిల్లలు, లగేజీతో క్యూలైన్ కేంద్రంలో పడిగాపులు కాశారు. మరో వైపు కాలినడక భక్తులు అలిపిరి వద్ద దీపారాధన చేసి, కొబ్బరికాయలు కొట్టి, తిరునామం ధరించి, మెట్లపూజ చేసి తిరుమలకు పయనమయ్యారు. భక్తుల గోవిందనామ స్మరణతో అలిపిరి మారు మోగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



క్యూలో ఉన్న భక్తులు



సర్వదర్శనం టికెట్ కేంద్రంలో టికెట్లు పొందుతున్న భక్తులు రద్దీ

సమాజ హిత పరిశోధనల్లో మహిళా వర్సిటీ ముందంజ

తిరుపతి ఎడ్యుకేషన్ : సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయడంలో పద్మావతి మహిళా వర్సిటీ ముందంజలో ఉందని ఇన్‌చార్జ్ వీసీ కె.రాజారెడ్డి తెలిపారు. వర్సిటీలోని సావేరి సెమినార్ హాలులో శనివారం నిర్వహించిన డిసిమినేటస్ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శాశ్వత పరిష్కారం వైపు ట్రాన్స్ డిసిప్లినరీ పరిశోధనలు నిర్వహించేందుకు వర్సిటీకి యూజీసీ స్ట్రైడ్ కాంపోనెంట్ వన్ కింద ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ ఇనిషియేటివ్ సెంటర్ ఇన్ అడాలసెంట్ హెల్త్ అనే ప్రాజెక్టుకు రూ.63 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా విద్యార్థులు, అధ్యాపక బృందానికి ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్‌పై సర్టిఫికెట్ కోర్సు అందించడంతో పాటు అనేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారు 6 బృందాలుగా ఏర్పడి కౌమార దశకు సంబంధించిన సమస్యలపై పరిశోధన చేయడానికి ప్రతిపాదనలు సమర్పించారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ మురళీధర్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం–2020 సైతం ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్‌కు ప్రాధాన్యత ఇస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ రజని, ట్రికా ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, కో ఇన్వెస్టిగేటర్లు ప్రొఫెసర్ ఉమామహేశ్వరి దేవి, ఉష పాల్గొన్నారు.



వర్క్‌షాపులో పాల్గొన్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

అన్నమయ్యకు ఘన నివాళి

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం అన్నమాచార్య కళామందిరంలో తాళ్లపాక అన్నమయ్య 520వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠి గానం ఆకట్టుకుంది. అనంతరం హారతి, మహానివేదన చేపట్టారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు తిరుపతికి చెందిన రాధ బృందం ఆలపించిన సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర్లు భాగవతార్ హరికథ గానం, హరినాథ్ భరతనాట్య నృత్య రూపకం కనువిందు చేసింది. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు పాల్గొన్నారు.



సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం చేస్తున్న కళాకారులు

నచ్చిన రంగంలో రాణించండి

తిరుపతి అర్బన్: పాఠశాల దశ నుంచే భవిష్యత్‌పై కొత్త ఆలోచనలో నచ్చిన రంగంలోకి అడుగులు వేయాలని డీఈవో వి.శేఖర్ విద్యార్థులకు సూచించారు. డీఈవో కార్యాలయంలో శనివారం వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి, ఎక్స్‌పో సమగ్ర శిక్ష అనే కార్యక్రమాలు నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన 10 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటిలో రెండు నమూనాలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అసిస్టెంట్ ఏఎంవో మధు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ సారథి, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ భానుప్రసాద్, ఈఎండీపీ జిల్లా మేనేజర్ అనిత పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన కల్పించాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు సైన్సుపై అవగాహన కల్పించాలని డీఈఓ శేఖర్ తెలిపారు. తిరుపతిలోని శ్రీనివాస హైస్కూల్లో శనివారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. పలు నమూనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిశోధనలు, వాటి ఆవిష్కరణలతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని చిన్నతనం నుంచే విద్యార్థులను పరిశోధనా రంగంవైపు దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. తిరుపతి అర్బన్ ఎంఈఓ ప్రభాకరరాజు, పాఠశాల అధినేత సుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు.



శ్రీనివాస హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న తిరుపతి డీఈఓ శేఖర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్ : తిరుపతి నగరంలో విద్యుత్‌లైన్ల మరమ్మతులు, చెట్లు కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వాసుదేవరెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు కొర్లగుంట, భవానీనగర్, టీకేస్ట్రీట్, అశోక్‌నగర్, తిలక్‌రోడ్డు, తుడా రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వుండని తెలిపారు.

28 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి అలిపిరి: నెల్లూరు జిలా కావలి ఫారెస్ట్ బీటు పరిధిలో 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్టు టాస్క్ ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆర్ఐ కృపానంద టీమ్‌లోని ఆర్ఎస్ఐ అలీబాషా తదితరులు రాపూరు నుంచి తనిఖీ చేపట్టారని తెలిపారు. నెల్లూరు జిల్లా కావలి వద్ద అన్నపూర్ణ రైస్ మిల్లు సమీపంలో కొందరిని పట్టుకునేందుకు ప్రయత్నించినట్టు పేర్కొన్నారు. ముగ్గురిని అదుపు లోకి తీసుకున్నట్టు చెప్పారు. 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులు నెల్లూరు టౌన్‌కు చెందిన గల్లా ఉదయ భాస్కర్ (57), బద్వేలుకు చెందిన అబ్బు భాస్కర్ (39), బాలపల్లికి చెందిన రియాజ్ (29)గా తేలిందన్నారు. పరారీలో ఉన్న ఏర్పేడుకు చెందిన మణి, సుధాకర్, రైల్వే కోడూ రు వ్యక్తి దశరథ నాయుడు కోసం గాలిస్తున్నామన్నారు. దుంగల విలువ రూ.75 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. ఈ కేసును సీఐ చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు. అధికారులను డీఐజీ సెంథిల్ కుమార్ అభినందించారు.



నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నేడు బహుమతుల ప్రదానం

తిరుపతి కల్చరల్: తెలుగు భాషా ప్రావీణ్యత పోటీ పరీక్షల్లో గెలుపొందిన పిల్లలకు ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఎస్వీయూ సెనేట్ హాల్లో బహుమతులు అందజేయనున్నట్టు తెలుగు భాషోద్యమ సమితి సమన్వయకర్త తమటం రామచంద్రారెడ్డి, టింకాయల దామోదరం తెలిపారు. తెలుగు భాషాభిమానులు, సాహితీ వేత్తలు, రచయితలు, కవులు హాజరుకావాలని కోరారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మా వతి అమ్మవారిని శనివారం తెలంగాణ మంత్రి సత్యవతి రాథోడ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర డీజీపీ సతీష్ గొల్హా కుటుంబ సమేతంగా వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆలయ సూపరింటెండెంట్ శేషగిరితో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సాంస్కృతిక కళా గర్జన

తిరుపతి కల్చరల్: సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలో సాంస్కృతిక కళా గర్జన నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆమూరు సుధాకర్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జవాజి ఫణీంద్ర తెలిపారు. వారు శనివారం అంబేడ్కర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు.

31న న్యాయవాద సంఘం ఎన్నికలు

తిరుపతి లీగల్ : ఈ నెల 31వ తేదీన న్యాయవాద సంఘం కార్యవర్గ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది గొట్టి గజేంద్రను నియమించినట్టు పేర్కొన్నారు. ఈ నెల 21న నామినేషన్లు, 23న నామినేషన్ల పరిశీలన, 24న ఉపసంహరణ, 25న పోటీలోని అభ్యర్థుల ప్రకటన ఉంటుందని తెలిపారు. అధ్యక్ష పదవికి న్యాయవాదిగా 20 ఏళ్ల అనుభవం, ఉపాధ్యక్ష పదవికి 15 ఏళ్లు, ప్రధాన కార్యదర్శి పదవికి 12 ఏళ్లు, జాయింట్ సెక్రటరీ పదవికి, మహిళా సభ్యురాలు పదవికి 10 ఏళ్లు, గ్రంథాలయ కార్యదర్శి, కోశాధికారి, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పదవులకు 8 ఏళ్లు అనుభవం ఉండాలని తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో నమోదైన న్యాయవాదులు మాత్రం ఓటు వేయడానికి అర్హులని తెలిపారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

తిరుపతి అర్బన్ : బాలబాలికలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఉద్దేశమని రాష్ట్ర సభ్యురాలు శ్రీలక్ష్మి తెలిపారు. ఆమె శనివారం డీఈవో కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే సమాజంపై అవగాహన ఉంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారని, సమాజం పట్ల బాధ్యత పెరుగుతుందని చెప్పారు. ఆ దిశగా తాము కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. రెండు రోజులుగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని పాఠశాలలు, బాలసదన్లను పరిశీలించామని వెల్లడించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి విద్యాశాఖతోపాటు అనుబంధ శాఖలు కృషి చేయాలని కోరారు.

ముగిసిన ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు

తిరుపతి తుడా: తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలో ప్రపంచ గ్లకోమాపై చేపట్టిన వారోత్సవాలు శనివారం ముగిశాయి. వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగమునీంద్రుడు మాట్లాడుతూ కంటి సంబంధిత రోగాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రేపటి నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి ఆలయంలో సోమవారం నుంచి 28వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఆదివారం సాయంత్రం సేనాధిపతి ఉత్సవం, మేదిని పూజ, మృత్సంగ్రహణం, శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టనున్నారు. సోమవారం ఉదయం 8.45 నుంచి 9.32 గంటల మధ్య ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి.

భాష్యంలో గ్రాడ్యుయేషన్ డే

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి ధనలక్ష్మినగర్‌లోని భాష్యం పాఠశాలలో శనివారం యూకేజీ, 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహిళా వర్సిటీ హోమ్ సైన్స్ విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ వి.బిందు హాజరై చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత విద్యనభ్యసించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పాఠశాల జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ సంబరాలు



కేకు తినిపించుకుంటున్న నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఎస్వీ యూనివర్సిటీలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. వర్సిటీ అకడమిక్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ఐఎస్.కిషోర్, ఎస్వీయూ వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుడు ప్రేమ్, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, శివశంకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

తిరుపతి ఎడ్యుకేషన్: కరకంబాడిరోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఐక్యం–పూర్వ విద్యార్థుల సమ్మేళనం 2023 నిర్వహించారు. ఆ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. కళాశాల డైరెక్టర్ మన్నెం రామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఇంజినీరింగ్ విద్యనందించాలన్న సత్సంకల్పంతో చైర్మన్ మన్నెం రామిరెడ్డి 2008లో కళాశాలను స్థాపించారని పేర్కొన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత కొలువుల్లో రాణిస్తుండడం గర్వంగా ఉందని తెలిపారు. కళాశాల డైరెక్టర్ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ కె.జయచంద్ర పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ తదితరులు

అటవీ రక్షణ అందరి బాధ్యత

తిరుపతి ఎడ్యుకేషన్ : మానవాళి మనుగడలో అడవుల పాత్ర కీలకమని, అటవీ ప్రాంతాలను రక్షించుకోవడం అందరూ బాధ్యతగా భావించాలని ఎస్వీయూ వీసీ కె.రాజారెడ్డి పిలుపునిచ్చారు. వర్సిటీలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ అటవీ దినోత్సవ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ మూడు రోజుల పాటు అడవులు–ఆరోగ్యం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్, మహిళా సాధికారత డీన్ సావిత్రమ్మ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజారెడ్డి తదితరులు

నాణ్యమైన వైద్యం అందించాలి

భాకరాపేట : రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం భాకరాపేటలో ప్రైవేటు ఆస్పత్రిని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భాకరాపేట ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని యాజమాన్యానికి సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొండారెడ్డి, గురుశంకర్, ఖదీర్‌అహ్మద్, సాకిరి భూ పాల్, హరిప్రియ, ఆస్పత్రి వైద్యులు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

లోక్ అదాలత్‌లో 32 కేసులు పరిష్కారం

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో 32 కేసులు పరిష్కారమైనట్టు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ వై.వీర్రాజు తెలిపారు. వాటిలో మూడు క్రిమినల్, ఎనిమిది సివిల్, మూడు వివాహ సంబంధ, ఒకటి మోటారు వాహనం, ఒకటి వ్యాజ్యం వేయని కేసులు ఉన్నట్టు తెలిపారు. అలాగే తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఆరు కేసుల్లో జరిమానా విధించినట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. కేసుల పరిష్కారం కోసం నాలుగు బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

తిరుమలలో అఖండ హనుమాన్ చాలీసా పారాయణం

తిరుమల: స్థానిక నాదనీరాజనం వేదికపై శనివారం అఖండ హనుమాన్ చాలీసాపారాయణం చేపట్టారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, యుగతులసి ఫౌండేషన్ చైర్మన్ శివకుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం వరకు కొనసాగనుంది. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, బోర్డు సభ్యుడు పోకల అశోక్ కుమార్, తెలుగు రాష్ట్రాలకు చెందిన 500 మంది భక్తులు పాల్గొన్నారు.



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు, ఈవో

క్యాంపస్ సెలెక్షన్స్‌లో 60 మంది విద్యార్థుల ఎంపిక

చంద్రగిరి: క్యాంపస్ సెలెక్షన్స్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ సుకుమార్ తెలిపారు. మండలంలోని ఐతేపల్లిలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం టీసీఎల్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 70 మంది విద్యార్థులు హాజరుకాగా 60 మంది ఎంపికైనట్లు తెలిపారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడంతో సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను కళాశాల హెచ్‌వోడీ నరసింహారెడ్డి, భక్తవత్సలం అభినందించారు.



నియామక పత్రాలు అందుకుంటున్న ప్రిన్సిపాల్ సుకుమార్

ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణ వేదిక పరిశీలన

తిరుపతి అలిపిరి: శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 5న జరుగనున్న సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు వేగవంతం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం కల్యాణ వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి విడిది చేసే భవనం, ఆలయ పరిసరాలు, పుష్కరిణి, వాహన మండపం, అన్నప్రసాదాలు, తాగునీరు పంపిణీ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. టీటీడీ సీఈ నాగేశ్వరరావు, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి అధికారి శాస్త్రి పాల్గొన్నారు.